# ప్రణవ పద్మాకరం

## అక్టోబర్ 25





# అక్టోబర్ , 2025

అక్టోబర్ , 2025
సంపుటి-4
సంచిక-10

## విషయ సూచిక

| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 03 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నడుముక్కల శ్రీకరి |
| 04 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 05 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 06 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 09 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |

శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యోనమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

# సంపాదకీయం

## ఆశ్వయుజ, కార్తికమాసాలు - పుణ్యప్రదాలు



ఆశ్వయుజ, కార్తికమాసాలు రెండూ ఈ సంవత్సరం అక్టోబరులో నిక్షిప్తాలయ్యాయి. ఆదికవి వాల్మీకి మహర్షి లోక శ్రేయస్సు కోసం పరమపవిత్రమైన వేదసారాన్ని శ్రీమద్రామాయణంగా రచించి లోకానికి అందించాడు. శ్రీరామాయణం జీవనపారాయణం. వాల్మీకిమహర్షి ఆశ్వయుజ పూర్ణిమ నాడు జన్మించాడు. ఆయన జన్మతిథి నాడు సంక్షిప్తరామాయణం పారాయణ చేసి ఆయన ఋణం ఎంతో కొంత తీర్చుకొందాం. లోకద్రోహి, స్త్రీలోలుడు, నీచుడు అయిన భూపుత్రుడు నరకుని శ్రీకృష్ణుడు ఆశ్వయుజ కృష్ణ చతుర్దశినాడు వధించాడు. ఆ రోజు నరకచతుర్దశిగా ప్రసిద్ధి కెక్కింది. అనాడు భక్తితో శ్రీకృష్ణుని పూజించాలి. ఆశ్వయుజ అమావాస్య నరకుని వధ వల్ల దీపావళి అమావాస్య గా ప్రసిద్ధికెక్కింది. అంతకంటే ముందు ఆ అమావాస్య నాడు సృష్టి ఆరంభ కాలంలో శ్రీమహాలక్ష్మి లోకసంచారం చేయడం వల్ల దానిని పద్మాఅమావాస్య అని కూడా అన్నారు. అమావాస్య నాడు పద్మాలతో లక్ష్మిని శక్తిని అనుసరించి పూజిస్తే దారిద్ర్యం తొలగిపోతుంది. రాత్రికి దీపాలు వెలిగించి ప్రమాదం లేని రీతిలో మతాబులు, టపాసులు మున్నగునవి కాల్చుకొని నరకవధ పండుగగా జరుపుకోవడం ఆచారమయ్యింది. ఈ ఆచారాన్ని పాటిస్తూనే జాగ్రత్తలు తీసుకొని శరీరాలను రక్షించుకొందురు గాక! 22 అక్టోబరు నుండి కార్తిక మాసం ఆరంభమవుతుంది. న కార్తిక సమో మాస: అని పురాణ వాక్కు. కార్తికమాసంలో స్నానాలు, దీపదానాలు, ఉపవాసాలు చేసి తరించండి.నాచే రచింపబడిన కార్తిక పురాణం పారాయణ చేయండి.కార్తిక పురాణంలో ముద్రణలో అక్షరదోషాలు చాలా కనబడుతున్నాయి. వాటిని సవరించి ద్వితీయ ముద్రణలో సర్వాంగ సుందరంగా శిష్యులు అందించగలరని భావిస్తున్నాను. భక్తులు ఆ అక్షరదోషాలు సవరించుకొంటూ చదివి గరుడపురాణం లేదా గురువిరచిత శివపురాణం, అష్టాదశశక్తిపీఠాలు ఇత్యాది గ్రంధాలు ఈ మాసంలో దానం చేయండి. కార్తిక శుక్ల అష్టమి 'కార్తవీర్య జయంతి''. ఆ దినాన దత్తాత్రేయుని పూజించాలి. 25 అక్టోబరు న నాగులచవితి నాడు నాగపూజ చేయాలి. బ్రహ్మవైవర్తపురాణం ప్రకారం కార్తిక శుక్లాష్టమి నాడు రాధాకృష్ణులను పూజిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. దేశం సనాతన ధర్మం వైపు మళ్ళి, ప్రపంచానికి సుఖశాంతులను అందించాలంటే మన ప్రణవపీఠ భక్తులు గుడి-బడి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలి. పురాణ ప్రచారం చేయాలి. దానికి మనకు అవసరమైన విషయాలను ఆధ్యాత్మికంగా సాంస్కృతికంగా ప్రోదిచేసి అందించే 'ఆధ్యాత్మిక దీపిక', ప్రణవపీఠ అక్షర ప్రసాదం 'ప్రణవపద్మాకరం'. సమస్త పాఠకలోకానికి 'జ్ఞానచైతన్యదీప్తి'ని పంచాలని, సమస్త సాధకులు దీనిని స్వీకరించాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం

శ్లో॥ గణేశ మేకదంతం చ, హేరంబం విఘ్ననాయకం
లంబోదరం శూర్పకర్ణం, గజవక్త్రం గుహా గ్రజమ్ ॥
అష్టాఖ్యార్థం చ పుత్రస్య శ్రుణుమాతః హరప్రియే
స్తోత్రాణాం సారభూతం చ సర్వవిఘ్నహరం పరమ్ ॥

(బ్ర.వై.పు.తృతీయఖండం.అ.44.శ్లో.85,86)

(1) గణేశుడు (2) ఏకదంతుడు (3) హేరంబుడు (4) విఘ్ననాయకుడు (5) లంబోదరుడు (6) శూర్పకర్ణుడు (7) గజవక్త్రుడు (8) గుహాగ్రజుడు — ఈ ఎనిమిది గణపతి అష్టనామాలుగా ప్రసిద్ధికెక్కుతాయి. ఇవి అత్యంత పవిత్రమైనవి. ఈ నామాలను ఉదయం పఠిస్తే విఘ్నాలు తొలగుతాయి. మధ్యాహ్నం పఠిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. సాయంత్రం, రాత్రి పఠిస్తే సకల శుభాలు, ఆరోగ్యం, ఐశ్వర్యాదులు లభిస్తాయి. 40 దినాలు ఈ నామాలను విడువక మూడు పూటలా పఠించిన వాడు అనుకొన్న పనులు నెరవేర్చుకోగలుగుతాడు. సర్వత్ర విజయం పొందుతాడు.

ప్రజలకోసం నీకు వివరిస్తున్నాను. నీవు సర్వజ్ఞురాలివి. భక్తులకోసం ఈ వివరణ తప్ప వాగర్థస్వరూపులైన పార్వతీపరమేశ్వరుల కోసం కాదు. ఈ నామాలలో గల విశేషార్థాలు గ్రహించి పఠించిన వాడు సర్వవిఘ్నాల నుండి విముక్తుడవుతాడు.

శ్లో॥ జ్ఞానార్థ వాచపో గశ్చ ణశ్చ నిర్వాణవాచకః
తయోరీశం పరం బ్రహ్మ గణేశం ప్రణమామ్యహమ్ ॥

(బ్ర.వై.పు.అ.44.శ్లో.87)

"గ" అనే అక్షరం జ్ఞానము అనే అర్థం కలిగి ఉంటుంది. "ణ" అనే అక్షరానికి మోక్షము అని అర్థం. జ్ఞాన మోక్షాలు రెండింటినీ ఇచ్చే పరబ్రహ్మ అవ్వడం వలన వినాయకునికి గణేశుడని పేరు కలిగింది. ఆయనకు నమస్కారం.

శ్లో॥ ఏకశబ్దః ప్రధానార్థో దంతశ్చ బలవాచకః
బలం ప్రధానం సర్వస్మా దేక దంతం నమామ్యహమ్ ॥

(బ్ర.వై.పు.అ.44.శ్లో.88)

ఏక శబ్దానికి ప్రధానము, ముఖ్యమైనది అని అర్థం. దంత శబ్దానికి బలం అని అర్థం. బలప్రధానుడు అనగా ఇంతింత అనరాని మహాబలశాలి కనుక గణేశుని ఏకదంతుడన్నారు.

శ్లో॥ దీనార్థ వాచకో హేశ్చ రంబః పాలకవాచకః
పాలకం దీనలోకానాం హేరంబం ప్రణమామ్యహమ్ ॥


(బ్ర.వై.పు.అ.44.శ్లో.89)

"హే" అను అక్షరానికి దీనుడు అని అర్థం. రంబ అనగా పాలించువాడు. దీన జనులను పాలించి, కాపాడువాడు కనుక గణపతిని హేరంబుడన్నారు.

శ్లో॥ విపత్తి వాచకో విఘ్నో నాయకః ఖండనార్థకః
విపత్ ఖండన కారం తం ప్రణమే విఘ్ననాయకమ్ ॥

(బ్ర.వై.పు.అ.44.శ్లో.90)

విఘ్న శబ్దానికి ఆపద, కష్టం, ఆటంకం అనే అర్థాలున్నాయి. నాయకుడనగా ఖండించేవాడు. ఆపదలను ఖండిస్తాడు కనుక ఆయనను విఘ్ననాయకుడన్నారు. ఆయనకు నమస్కారం.



.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

మానవజన్మ ఎన్నో జన్మల పుణ్యఫలం. అందుకే మనుష్యజన్మ దుర్లభం అన్నారు. ఈ భూలోకంలో ఉత్కృష్టమైన మానవ జన్మను పొంది కూడా శ్రీ వేంకటేశుని దర్శించక, అర్చించక జీవితాన్ని వ్యర్థం చేసుకొన్నవాడు నీచ జన్మలు ఎత్తుతాడు. వాడి మానవజన్మ వ్యర్థం. వాడు మరణించాక వాని శరీరాన్ని కుక్కలు కూడా ముట్టవు. ఘోరనరకాలపాలై కృమికీటకాల జన్మలు ఎత్తుతాడు. దేవదేవుడు అయిన శ్రీ వేంకటేశ్వరుని పూజించిన వానికి అన్యదేవతల వల్ల ప్రయోజనం ఏముంటుంది? కారణం అన్ని దేవతల రూపాలు ఆయనలో ఉండడమే. మానవజన్మ అనేక దుఃఖాలతో నిండిన, వ్యథలతో కూడిన జన్మ. వేంకటేశుని భక్తులను దర్శించినా, వేంకటేశ్వరుని భక్తులను సేవించినా, ఆయన కథలను విన్నా చాలు. మానవజీవితంలోని దుఃఖాలు పటాపంచలవుతాయి. సర్వసుఖాలు లభిస్తాయి. భక్తులను, భక్తుల బంధువులను, భక్తుల స్నేహితులను కూడా యముడు శిక్షించడు. కాకపోతే భక్తుల సంబంధులు కూడా నాస్తిక వాదులు కాకుండా ఉండాలి. నాస్తికులు, భిన్నమర్యాదులు, కృతఘ్నులు, మోసగాళ్ళూ, కనబడితే, వారికి దూరంగా ఉండాలి. వారికి నమస్కృతులు చేయరాదు. ఈ పైన పేర్కొన్న వారు మహాపాతకులు. వారు కూడా పశ్చాత్తాపం పొంది, శ్రీనివాసుని స్మరించుకొంటే ఆయా మహాపాతకాల నుండి విముక్తులవుతారు. బ్రహ్మహత్య, సురాపానం, స్త్రీహత్య, శిశుహత్య వంటి పాపాలకు విముక్తి లేదు. అటువంటివారు కూడా శ్రీశ్రీనివాసుని భక్తితో ఒక్క సారి, స్మరించినంతమాత్రాన పాపవిముక్తులవుతారు. మోక్షమిచ్చే దేవుడు లౌకిక సుఖాలు ఇవ్వకుండా ఉంటాడా? స్వర్గ సుఖాలు, భోగాలు, కావాలని కోరుకొనే వారు ఒక్కసారి శ్రీ వేంకటాద్రిని దర్శించి, శ్రీవేంకటేశ్వరుని భక్తితో తలచుకొంటే చాలు. అన్నీ లభిస్తాయి.

....ఇంకా ఉంది



# పురాణం లో మహిళలు

## శకుంతల

విశ్వామిత్రుడితపస్సు భంగం చేయడానికి ఇంద్రుడు మేనకను పంపిస్తాడు. మేనక చేత ఆకర్షితుడైన విశ్వామిత్రుడు తపస్సు నుండి రతిక్రీడలోకి మారతాడు. ఫలితంగా మేనక గర్భవతిఅవుతుంది. విశ్వామిత్రుడు బయటి వాతావరణం చూసి శిశిర ఋతువు అవడం గ్రహించి తపోభంగం జరిగిందని గ్రహించి, మేనకను అక్కడ నుండి పంపివేస్తాడు. మేనక ఆడబిడ్డను ప్రసవించి, ఇసుక దిబ్బ మీద విడిచి, వెళ్ళిపోతుంది. అలా విడిచిన బిడ్డను పక్షులు తమ రెక్కలతో రక్షిస్తాయి. ఆ మార్గములో వెళుతున్న కణ్వమహర్షి ఆ బిడ్డను చూసి పక్షుల రెక్కల చేత రక్షింపబడడం వల్ల శకుంతల అని పేరు పెట్టి, తన ఆశ్రమంలో పెంచి పెద్దచేస్తాడు. దుష్యంతుడు ఒక రోజున జింకను వేటాడుతూ, కణ్వమహర్షి ఆశ్రమము వైపు వస్తాడు. అక్కడ శకుంతలను చూసి మోహితుడై ఆమె పరిచయం అడుగుతాడు. శకుంతల తన తండ్రి తనకు చెప్పిన జన్మ వృత్తాంతం చెబుతుంది. అప్పుడు దుష్యంతుడు ఆమెను గాంధర్వ వివాహం చేసుకొని గర్భదానం చేస్తాడు. తన రాజ్యానికి వెళ్ళి సకల సంభారాలతో, రాచమర్యాదలతో తాను ఆహ్వానిస్తానని చెప్పి వెళ్ళిన దుష్యంతుడు ఎంతకూ రాడు. శకుంతల గర్భవతి అన్న విషయం కణ్వమహర్షికి తెలుస్తుంది. కణ్వమహర్షి దివ్యదృష్టితో జరిగినది తెలుసుకొని శకుంతల భరతుడిని ప్రసవించాక, ఆమెకు కొందరు ఋషులను తోడిచ్చి, హస్తినాపురానికి, దుష్యంతుని వద్దకు, భరతునితో సహా పంపిస్తాడు. శకుంతలను దుష్యంతుడు గుర్తించడు. భరతుడిని తన కొడుకుగా అంగీకరించడు. కాని తరువాత ఆకాశవాణి పలికిన మాటలు విని జరిగిన వృత్తాంతం గుర్తుకు తెచ్చుకొని, శకుంతలను తన భార్యగాను, భరతుని తన కుమారుడిగాను అంగీకరిస్తాడు. వేరే ఇతిహాసం ప్రకారం మరొక కథ ప్రచారంలో ఉన్నది. దుష్యంతుడు తన రాజ్యానికి వెళ్ళి సకల సంభారాలతో రాచమర్యాదలతో తాను ఆహ్వానిస్తానని చెప్పి అభిజ్ఞాతము (గుర్తు) గా తన అంగుళీయకాన్ని ఇచ్చి వెళ్ళిపోతాడు. రాజ్యానికి వెళ్ళిన దుష్యంతుని నుండి ఎప్పటికీ ఆహ్వానం రాదు. ఆమె దుష్యంతుడి తలచుకొంటూ ఆలోచిస్తూ ఉంటుంది. దూర్వాసుని శాపం ఇలా ఉండగా ఒకరోజున దూర్వాసుడు కణ్వమహర్షి ఆశ్రమానికి వస్తాడు. శకుంతలను దూర్వాసుడికి సపర్యలు చేయడానికి నియోగిస్తారు. కాని శకుంతల దుష్యంతుడిపై తలపుతో ఎప్పుడూ పరధ్యానముగా ఉంటుంది. అది చూసిన దూర్వాసుడు కోపించి, ఎవరి గురించి ఆలోచిస్తున్నావో వారు నిన్ను మరుస్తారు అని శపిస్తాడు. అప్పుడు శకుంతల ప్రార్థించగా, నిన్ను మరిచినవారు నీకిచ్చిన గుర్తును చూస్తే నిన్ను గుర్తిస్తారు అని శాపవిమోచనం చెబుతాడు. ఇలా శాపగ్రస్తురాలైన శకుంతల ఒకరోజు నది దాటుతూ తన చేతిని నీళ్ళలో పెడుతుంది. అప్పుడు దుష్యంతుడు ఆమెకు ఇచ్చిన అంగుళీయకం నీళ్ళలో పడిపోతుంది.



శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 347. . విమలా – (ఓం ఐం హ్రీం శ్రీం విమలాయై నమః)



విమల అనగా స్వచ్ఛమైనది. స్వచ్ఛమనస్సు గలది. మలము అనగా దోషము, అవిద్య అని కూడా అర్థాలున్నాయి. అవిద్యాది దోషాలు లేనిది విమల. వాస్తును బట్టి ఇండ్లను నిర్మించేటప్పుడు విమల గృహం అనబడే ఇంటిని నిర్మిస్తే ఇంటిలోని వారికి మంచి మనస్సులు లభిస్తాయని, సుఖంగా జీవిస్తారని విశ్వకర్మ భగవానుడు వివరించాడు. విమల గృహరూపిణి అమ్మవారే.

### మంత్రప్రయోగవిధానం— ఫలితం

ఈ మంత్రాన్ని మంగళ శుక్రవారాలలో యథాశక్తిగా జపించి, తీపిని అమ్మవారికి నివేదిస్తే మంచి మనస్సు లభిస్తుంది. ఇంటిలోని వాస్తు దోషాలుపోతాయి. కుటుంబ సభ్యులు కలిసి మెలసి ఆనందంగా జీవిస్తారు.ఈర్ష్యాసూయాదులు తొలగిపోతాయి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# మహర్షి అష్టావక్రుడు


మహర్షి అష్టావక్రుడు హిందూ ధార్మిక పరంపరలో ఒక గొప్ప ఋషిగా పేరుపొందాడు. ఆయన జీవితము విజ్ఞానం, భక్తి, త్యాగం, పితృభక్తి, ధర్మనిష్ఠతో కూడిన ఒక ఆదర్శమూర్తిగా నిలిచింది. అష్టావక్రుడు పుట్టుకనుంచే అసాధారణమైన వ్యక్తిగా భావించబడ్డాడు. పుట్టినపుడు అతని శరీరం ఎనిమిది వంకరలతో ఉండటంతో అతనికి "అష్టావక్రుడు" అనే నామకరణం చేయబడింది.ఒకనాడు తన తండ్రి వేదపాఠం వల్లె వేయుచుండగా గర్భమందున్న ఆ బాలకుడు సావధానంగా వింటూ స్వరము తప్పినదని పలికినాడు. అంతే కాదు నిద్రాహారములు లేకుండా శిష్యులచే రాత్రింబవళ్ళు అధ్యయనం చేయిస్తే వారు మందమతులు అవుతారని తండ్రిని తప్పుపట్టినాడు. తనకు పుట్టబోవు కుమారుడు దివ్యమహిమోపేతుడని గ్రహించి తండ్రి ఎంతగానో సంతోషించాడు. కాని పుట్టకుండానే తనను తప్పుపట్టినాడని, వక్రముగ పల్కినాడని ఎనిమిది వంకరలతో పుట్టమని ఆ బాలుడిని శపించాడు.సుజాత ఒకనాడు ఏకపాదుని పిలిచి నాథా! నెయ్యి, ధాన్యము, నూనె తెండని చెప్పినది. అంత ఏకపాదుడు వాటి నిమిత్తమై జనక చక్రవర్తి వద్దకు వెళ్ళగా, ఆ సమయమున అచ్చట ఒక పందెము జరుగుచుండెను. వరుణుని కుమారుడగు వందితో వాదము చేసి గెలిచినవారికి సర్వమును ఇచ్చెదనని, ఓడినవారు జలమజ్జితులై వుండవలెనని విన్నాడు, ఏకపాదుడు. వందితో వాదమునకు తలపడి ఓడిపోయి నియమం ప్రకారం జలమజ్జితుడై వుండిపోయినాడు. సుజాత కుమారుని ప్రసవించింది. పుట్టిన ఆ బిడ్డ ఎనిమిది వంకరలతో ఉన్నకారణమున అతనికి అష్టావక్రుడని నామకరణం చేసారు. అదే సమయాన సుజాత తల్లి ఒక పుత్రుని కన్నది. ఆమె ఉద్దాలకుని భార్య. ఉద్దాలకుడు తన కుమారునకు శ్వేతకేతు అని నామకరణం చేసాడు. అష్టావక్రుడు, శ్వేతకేతు బాల్యము నుండి ఉద్దాలకమహర్షి వద్ద అధ్యయనం చేయసాగారు. అష్టావక్రుడు ఉద్దాలకుని తండ్రిగా శ్వేతకేతుని సోదరునిగా భావిస్తూ విద్యాధ్యయనం సాగించాడు.ఒకనాడు అష్టావక్రుడు ఉద్దాలకుని తొడపై కూర్చొనిఉండ శ్వేతకేతువు ఆతని 'ఇది నీ తండ్రి తొడకాదు, నా తండ్రి తోడ లెమ్ము' అని లాగివైచెను. అష్టావక్రుడు ఏడ్చుచు తన తల్లి వద్దకు వెళ్ళి 'నాతండ్రి యెవ్వరు' అని ప్రశ్నించగా, సుజాత ఈ వృత్తాంతమంతటియును కుమారునకు వివరించెను. తండ్రి జనకచక్రవర్తి వద్ద పందెంలో ఓడిపోవడంతో జలమజ్జితుడై వరుణుని యజ్ఞానికి పంపించబడ్డాడు. ఈ విషయం తెలిసిన అష్టావక్రుడు తన తండ్రిని విడిపించాలనే సంకల్పంతో చిన్నవయస్సులోనే రాజధానికి వెళ్ళి

.ఇంకావుంది



# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం



కాశీ లో ఇతర తీర్థములను సేవించినా,సేవించకున్నను నిన్ను సేవించిన వారికి నీ ఆశీస్సులతో నీ అనుగ్రహం వల్ల కాశీ యందు సంపూర్ణ ఫలితం కలుగుతుంది. నిన్ను ప్రతిరోజూ నమస్కరించిన వారికి అన్ని విఘ్నములు తొలగిపోయి కార్యక్రమములన్నీ సులభంగా నెరవేరును.కాశీ లో ఉండి రోజూ నీ నామ జపం చేసే వారికి అష్ట సిద్ధులు కలుగుతాయి, దివ్యభోగములు లభించి దేహాంతమున మోక్షలక్ష్మి కూడా వరిస్తుంది.కాశీకి దూర ప్రదేశములలో ఉన్నవారైనా నిత్యమూ నిన్ను స్మరించడం వలన కాశీవాస ఫలమును పొందుతారు. ఇది నా వాక్కు! ఇది ఎప్పటికీ వృథా కాదు అని శివుడు పలికెను.విఘ్నములన్నీ తొలగించడానికి నీవు అనేక రూపములను ధరించి కాశీయందు కొలువుతీరి ఉన్నావు అని నాకు తెలుసు.మంగళవారం చతుర్థితో కూడిన రోజున లడ్డూలతో గంధ, పుష్పములతో నిన్ను అర్చించిన వారికి శుభములు కలుగుతాయి.ప్రతి చతుర్థి నాడు నిన్ను పూజించిన వారు బుద్ధి కలిగి,పుణ్యం కలిగి, విజ్ఞానహితులై నిన్ను చేరుకొందురు.మాఘ శుక్ల చతుర్దశి రోజు నక్త వ్రతం ఆచరించి నిన్ను సేవించినవారు దేవతలకు కూడా పూజ్యులు అవుతారు.ఆ రోజు నీ వద్దకు యాత్ర చేసినవారు తెల్ల నువ్వుల లడ్డులను నీకు నివేదించి తాను తినాలి.క్షేత్ర సిద్ధి కోరువారు ప్రయత్నపూర్వకంగా నీ యాత్ర చేయాలి. మాఘ శుద్ధ చతుర్థినాడు నువ్వులతో హోమం చేస్తే సిద్ధి కలుగుతుంది. నీ సమీపమున చేయు మంత్రములు వలన వారి కోరికలు సిద్ధిస్తాయి. నేను చేసిన ఈ స్తోత్రమును విన్న వారికి విఘ్నములు బాధ కలుగవు. మానసిక పాపములు కూడా ఈ స్తోత్ర పారాయణ వలన నశిస్తుంది.మోక్షము కోరువారు ప్రయత్నపూర్వకముగా చదువవలెను

..ఇంకావుంది

# శ్రీ మంగళ చండీ స్తోత్రమ్

ఫలశ్రుతి : తీవ్ర కష్టాలులో వున్నవాళ్ళు ఈ స్లోకాలు భక్తితో పారాయణ చేస్తే వాళ్ళ కష్టాలు తొలగుతాయి.

దేవ్యాశ్చ మంగళస్తోత్రం యః శృణోతి సమాహితః|

తన్మంగళం భవేత్తస్య న భవేత్ తదమంగళమ్|

వర్ధతే పుత్ర పౌత్రైశ్చ మంగళం చ దినే దినే||

మహాదేవ ఉవాచ

రక్ష రక్ష జగన్మాతః! దేవి! మంగళ చండికే |హారికే విపదాంరాశేః హర్షమంగళకారిణే |1|

హర్షమంగళదక్షే చ హర్షమంగళదాయికే|శుభే మంగళదక్షే చ శుభే మంగళ చండికే |౨|

మంగళే మంగళార్హే చ సర్వమంగళ మంగళే|సతాం మంగళదే దేవి సర్వేషాం మంగళాలయే|3|

పూజ్యే మంగళవారే చ మంగళాభీష్టదైవతే|పూజ్యే మంగళభూపస్య మనువంశస్య సంతతమ్|4|

మంగళాధిష్టాతృదేవి మంగళానాం చ మంగళే|సంసార మంగళాధారే మోక్షమంగళదాయిని|5|

సారే చ మంగళాధారే పారే చ సర్వకర్మణామ్|ప్రతిమంగళవారే చ పూజ్యే దుర్గే సుఖప్రదే|6|

స్తోత్రేణానేన శంభుశ్చ స్తుత్వా మంగళచండికామ్|ప్రతిమంగళవారే చ పూజాం కృత్వాగతః శివః|౭|

ప్రథమే పూజితా దేవీ శివేన సర్వమంగళా|ద్వితీయే పూజితా సా చ మంగళేన గ్రహేన చ|8|

తృతీయే పూజితా భద్రా మంగళేన గృహేణ చ|చతుర్థే మంగళేవారే సుందరీభిః ప్రపూజితా|౯|

పంచమే మంగళాకాంక్షీ నరైర్మంగళచండికా|పూజితా ప్రతివిశ్వేషు విశ్వేశ పూజితా సదా|10|

తతః సర్వత్ర సంపూజ్యా బభూవ పరమేశ్వరీ|దేవైశ్చ మునిభిశ్చైవ మానవైర్మనుభిర్మునేః|11|

# గురుదేవుల జీవన కవనము

## చతుస్త్రింశతి అధ్యాయః



బెంగళూరు మహానగరానికి చేరుకుని గురువుగారు సప్తాహమును కూడా పూర్తి చేసుకున్నారు. బెంగళూరులో గురుదేవులకు ఆతిథ్యం ఇచ్చిన పుణ్యదంపతులు, విగ్రహముల కొరకు గురువు గారి ప్రయత్నం గురించి తెలుసుకొని అమ్మవారి అనుగ్రహంతో విగ్రహ తయారీకి కావల్సిన సొమ్మును మొత్తం తామే ఇస్తామని ప్రకటించడమే కాకుండా వెంటనే సొమ్మును కూడా అందజేసారు. ఏలూరు చేరుకున్న గురువుగారు పీఠ స్థాపన పూర్తవడం కోసం మహాలక్ష్మీ యాగాన్ని మూడు రోజుల పాటు నిర్వహించారు.ఈ యాగంలో పాల్గొనడానికి బెంగుళూరు నుండి వచ్చిన దంపతులకు సంతానం లేదు.ఈ యాగంలో గురువుగారి ఆజ్ఞతో పాల్గొనడం వల్ల వారికి ఏడాది లోపే సత్సంతానం కలిగింది. ఇది ప్రణవ పీఠం మహిమ. గురువుగారి నిరంతర శ్రమ వల్ల 2009 డిసెంబర్ నాటికి అమ్మవారి ప్రతిష్ఠ పూర్తయ్యింది.2010, భాద్రపద పౌర్ణమి నాటికి శ్రీ ప్రణవ పీఠం పూర్తిగా ఏర్పడింది. ఆ తర్వాత వచ్చిన దసరాలో అమ్మవార్లకు అంగరంగ వైభవముగా వేడుకలు, ఉత్సవాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ విధంగా అమ్మవారి లీలలతో గురువు గారి సంకల్పంతో భూలోక మణిద్వీపమైన శ్రీ ప్రణవ పీఠం ఏలూరు మహానగరంలో స్థాపించబడింది. ఆనాటి నుండి ఈనాటి వరకు శ్రీ ప్రణవ పీఠంలో భక్తుల మనోవాంఛలు అన్నీ నెరవేరాయి. భక్తులకు శ్రీ ప్రణవ పీఠం వరములిచ్చే గోవుగా మారింది,ఆ తర్వాత శ్రీ ప్రణవ పీఠంలో శ్రీరామ చంద్ర గుడి,రమా సమేత సత్యనారాయణ స్వామి గుడి, సత్య ధర్మలింగేశ్వర గుడి ప్రతిష్ఠలు కూడా జరిగింది.అనేక దేవతా ప్రతిష్ఠలు కూడా శ్రీ ప్రణవ పీఠంలో జరిగింది. ప్రణవ పీఠం సాక్షాత్తు భూలోక వైకుంఠం, మణిదీపం, కైలాసం

... ఇంకా ఉంది